


# పిల్లి

జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

[లోకంలోని అన్ని వింతలతో పాటు ఈవింతానూ— వితంతువుల్లో చాలామంది పిల్లుల్ని పెంచి, వాటికి చొక్కా పరికిణీ కుట్టించి కట్టి, వాటికి తలంటి పోసి, వంటికి నూనె రాచి, నెలకోమాటైనా గులిబి తీసి, వాళ్లకు వచ్చిన ఏమాచమ్మో, మంగమ్మో— పేరు బెట్టుకుని తనతో పాటు—తనకు కలిగిఉన్నంతలో నెయ్యి పిడచలే దానికి బెట్టి కన్నకూతుళ్లలాగు చూచుకునేవాళ్లూ ఉన్నారు అల్లాగే మనపిల్లీ మాపిల్లి—అన్నది శ్రీవారి నిక్‌నేము శ్రీ ౧౨ శాస్త్రిగారున్నారే వారు పిల్లి అంటే ఉడికి చచ్చేటంతపని అవుతారు అది వారి నామవిశేషం— ఇది మనలోమాట ]

పొద్దున ఎనిమిదిగంటలవేళ కొత్త కాఫీ దేవాలయానికి వెళ్లి సంధ్యవార్చుకుని గ్రంథాగారానికి వెళ్లి చదువుకుందామని పోతున్నా. పిల్లి కొట్టుదగ్గరకు వచ్చేసరికి పిల్లి పిలుస్తున్నాడని కబురు!

లోపలికి వెళ్లాను లోపలికి వెళ్లేటప్పటికి పిల్లి ఏం జేస్తున్నాడంటే—అద్దం ముందు కూర్చుని తన బెత్తెడు మీసాలకీ కామినియా ఆయిల్ రాచి సన్నపళ్లదువ్వెనతో దువ్వుకుంటున్నాడు—జ్వరంపడ్డ పిల్లలకు తల దువ్వినట్లు నేనేమనుకున్నానంటే—ఒకవేళ పేలు వీరి మీసాల్లో విడిదిచేశాయేమో—పాపం బ్రాహ్మడు మరామత్తు చేసుకుంటున్నాడని అబ్బే—అడిగి చూతునుగదా—అది వారి దినచర్యలో ప్రధానకృత్యంట!—నేను వచ్చిన కాస్సేపటికి మీసాల మరామత్తు మాని రేగుపండు తొడిమపిలకను స్వాధీనం చేసుకుని చెవిమీది వెంట్రుకలకు యింత భృంగామలక తైలం పూసి బ్రహ్మానంద భరితుడైనాడు—నేను ఉండలేక—బాబూ పిలిచారట—అన్నాను "అవునండీ" అన్నాడు

అల్లాగా అని పక్కనేఉన్న లోడారి బుచ్చిగాడు—అన్న గ్రంథాన్ని తీసుకుని చూచి అక్కడ పెడుతున్నాను— ఇంతలో రొండిసుండి పొడుంకాయ తీసి—ఓ అరణా పొడుం—రెండు ముక్కులకీ ఎక్కించి టుర్రుమని చీదుకుని—ఆకళంకం అంటిన చేతులు కడుక్కోకుండానే అరిటిపళ్లు వొలిచాడు—ఓటి నాకు పెట్టవస్తే వద్దని బ్రతిమాలుకున్నాక అన్నీ దబాయించి తినేశాడు ఏం ప్రారబ్ధంరా లైబ్రరీకి పోకుండా పిల్లి షాక్ యిచ్చింది— అనుకుని—లోపల చిముడుతున్నాను డజను పళ్లూ తిన్నాక అల్మారాలోని యింత పొగాకు తీసుకుని చేతికి కాస్త సున్నం రాసుకుని నలిపి కరకరా పటికబెల్లం మల్లే తినేసి నావంక అల్లా పరమసాహసి చూపులు చూచాడు. ఇఖ అగలేక లేవబోయాను—బాబూ రాత్రి నాటకానికి వెళ్లారా అని అడిగాడు—వెళ్లలేదని జవాబు చెప్పాను. పెదవులు చిట్లించుకుని, సరే—అని నిట్టూర్పు విడిచాడు నాటి రాత్రినాటకం తాను చూడకుండానే కరపత్రం సహాయంచేత తాను చసిన ఊచయుద్ధం (క్రిటిసిజమ్) ఓ పద్దాలుగు పేజీల వ్యాసం నాకందిచ్చాడు చూడమని— నాకు విసుగూ—కోపము వచ్చి—సరేలెండి చూస్తాంగా పత్రికల్లో—అప్పుడు చదివేతరహా వేరు—యిప్పటి బాణీ వేఱు అని అన్నాను సర్దుకుని. దాన్ని ఆంధ్రపత్రికకు

పంపుతానని చెప్పి జేబులో పెట్టుకుని వేషం—వేసుకుని విభూతీ అవి రాసుకుని బెలుదేరాడు—నేనూ నడుస్తున్నాను—నేను—కాఫీ దేవాలయముకు వెళ్లాను—ఆయనా వచ్చాడు దారిపొడుగునా అంతా తన నాటకాల కల్చర్ చెపుతూనే ఉన్నాడు గతిలేక నేను వింటూనే ఉన్నాను కాఫీహోటల్ గర్భగుడిలోకి చొరబడి కూర్చుని—కృష్ణా! ఆపద్బాంధవా—అని అరిచాను కృష్ణుడు (సర్వు చేసేవాడు) వచ్చి కనుక్కుని, ఓదోసె అవీ తెచ్చిపెట్టాడు మాపిల్లిఓఅరప్లేటు కాఫీతాగి అక్కణ్ణుంచీ బడితె బాజాలెక్చర్ ప్రారంభించాడు—ఆంధ్రబలం—దేశబలం—ఆంధ్రతేజస్సు—రోమబలం అంటూ ప్రారంభంచేసి తెలుగువాళ్లు ఉత్త చాతకానివాళ్లు చవటలు చాతనయితే హంపార్ ఉంటే ధిమాకీ ఏడిస్తే వచ్చి నా మీసాలకి నాలుగు పుణుగు రాళ్లు ఎత్తండి అవలీలగా చేస్తాను మీ గోనేమిటి తెలుగుదేశంలో మొనగాళ్లు ఉంటే రండి—షవ్వాల్! అంటూ తన తొడపరువును చాదినట్లుగా కొట్టుకున్నాడు

నాతో కుస్తీ పట్టి నన్నోడిస్తే వెయ్యి ప్రజంటు—లేకపోతే చాతకాకపోతే నేను తయ్యారుచేసిన రోమకళ అన్నలేహ్యం ఓమండలం సేవించండి—తర్వాత చెప్పుదుముగాని తడాఖా!

పచ్చిపేడ తన్నితే పదహారు వక్కలు కావాలి ఎండు పిడకను తన్నితే ఎగిరిఎగిరి పడాలి! మరి ఏమనుకున్నారు—నాసత్తా నాలేహ్యంసత్తా ఉత్తదన్నవాళ్లకు వంద రూపాయలు ప్రజంటు!! అని ఏకబిగిని లెక్చర్ ఊదేశాడు

నవ్వినవాళ్లు నవ్వారు, పిచ్చనుకున్నవాళ్లు పిచ్చనుకున్నారు ఇంతలో నాసంధ్యావందనం పూర్తిచేసి తత్సత్ బ్రహ్మార్పణమస్తు అని పూర్తిచేసి చెయ్యి కడుక్కుని కిళ్లీ బిగించి బిల్లు చెల్లించుకోటానికి యివతలకు వచ్చాను రోమకళ రోమబలం ఆంధ్రబలం భీమబలం రోమకళ అంటూ పిల్లి బైటకొచ్చాడు, శాలువా అటూ యిటూ సరుకుంటూ తాను తాగిన అరప్లేటు కాఫీకి అర్ధణా చెల్లించి రోమకళ డబ్బీని అందరకూ చూపించాడు అక్కడఉన్న పెదమనిషి ఒకాయన డబ్బీ ఖరీదెంతండీ అని అడిగితే ఎంతేమిటి చాలా స్వల్ప ఖరీదుకే యిస్తున్నాను—అంటూ బైటపడి హంగామాగా నడుస్తూ యింకో కాఫీహోటలుకు చేరుకున్నాడు—

మఱచిపోయాను పిల్లిచరిత్ర చెప్పటం మాపిల్లికి ఒడుగు పెద్దవాళ్లు చెయ్యలేదు పెళ్లిలేదూ పెటాకులూ లేదు. నాటకకళ అభిమానవిద్య అంటాడు బడితవైద్యం, భూతవైద్యం, రాచవైద్యం అంటూ వైద్యం కూడా తనకు వశమని చెప్తాడు. రోమకళ స్పెషలిస్టునంటాడు

అక్షరం ముక్కకంటే అఘాయిత్యానికి యెక్కువ ప్రాముఖ్యం యిచ్చి బ్రతుకు తెరువుని ఉపాసిస్తున్నాడు .

వీణ్ణి ఓ గంగా భాగీరథీ సమానురాలు అభిమానించింది అప్పుడప్పుడు పిల్లికి తలంట్లూ—కొత్తచొక్కాలూ వీడి భుక్తికి యింత పిండమూ పొడుం కాఫీహోటల్ ఖర్చులు—వీడివైద్యంఖర్చులూ ఆవిడ అప్పుడప్పుడు యిస్తూఉంటుంది వీడు యిఖ పదిగంటలవేళ రోడ్డుమీద నుంచుని-స్వరాజ్య-హిందూ తీసి, హెడ్డింగులు బిగ్గరగా చదువుతూ—నుంచుంటాడు, ఎవరన్నా ఎరిగిఉన్నవారు వస్తే వారికి పత్రిక యిచ్చి చదవమని గౌరవించి వారు చదివి చెప్పింది విని యిఖ యింటికి వెళ్లి అగంగాభాగీరథి దగ్గర—కన్సర్వేటివ్వులు యిల్లా అన్నారు కమ్యూనిస్టులు యిల్లా అన్నారు—లేబరు యిల్లా అంది పైనాన్సు యిల్లా ఉంది అంటూ రామాయణం కోస్తాడు పిల్లికి రాని శాస్త్రం లేదు పిల్లికి తెలియని ఆర్టు లేదు కొత్తవాళ్లని షాక్ చెయ్యటం వాడి అభిమానశిల్పం వాడితరహా అది అంతా వేరుట వాడి ఉన్నతాశయాలూ అవీ అందరికీ అర్థంగావుట అన్నట్లు మఱచిపోయాను వీడుకూడా కవి నవలలూ డ్రామాలూ అవీ రాశాడు—వీడు. వీడికో సిద్ధాంతం ఉంది అదేదనగా

పొగాకు విరాట్స్వరూపం పొడుం పరమాత్మకు సన్నిహితమైన తాదాత్మ్యస్వరూపం చుట్టా బీడీ సిగరెట్టులు ఉపాధి భేదంవల్ల వచ్చిన అవతారాలు అని తాను జగదతీతవ్యక్తి కనుక త్రిమతస్థుడుట—

అంటే కాలానుసారంగా పొడుం పొగాకూ కిళ్లీ పొగాకూ చుట్టా, బీడీ, సిగరెట్టూ—అన్నీ సేవిస్తాడుట

మీరుమాత్రం రోమకళ కొనదలచుకుంటే యీపత్రికకు వ్రాయండి—